
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 8 జూన్ 2025



అంతా నీవల్లే..!

- షో చేసేందుకు వెళ్లి తంటాలు
- అత్యుత్సాహంతోనే సమస్యలు
- తొక్కిసలాట తెలిసినా సంబరాల కొనసాగింపా..?
- డీసీఎం డీకేపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11మంది మృతి వివాదం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుక్కతిప్పుకోకుండా ఇబ్బంది కలిగిస్తోంది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఇద్దరూ విధానసౌధ వద్ద గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌తో కలసి క్రికెటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ ఉత్సాహంగా షో చేసేందుకు వెళ్లి తంటాలు వచ్చాయని సీఎం సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రివర్గ సమావేశం సందర్భంగా సీఎం తీవ్రంగానే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు, చిన్నస్వామి స్టేడియంకు వెళ్లి అత్యుత్సాహం ప్రదర్శించినందుకే ప్రతిపక్షాల నుంచి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. వారి ప్రశ్నలకు తాను సమాధానం చెప్పాల్సి వస్తోందని సీఎం ఆగ్రహానికి లోనైనట్లు తెలుస్తోంది. లక్షలాదిమంది వచ్చినందున క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పదాధికారులు లోపల వెళ్లేందుకు వీలు లేనందునే తన కారులో తీసుకెళ్లాల్సి వచ్చిందని డీసీఎం వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. వాటికి ప్రభుత్వం తిప్పికొట్టే పరిస్థితి కూడా లేకపోయింది. హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్‌కు డీకే శివకుమార్ ఒక్కరే వెళ్లి స్వాగతించారు. విధానసౌధ వద్ద జరిగిన కార్యక్రమంలో సీఎం మనవడు, మంత్రి జమీర్ అహ్మద్ కుమారుడు, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ కుమారుడు, చీఫ్ సెక్రటరీ కుమార్తెతోపాటు మరో నలుగురైదుగురు ఎమ్మెల్యేలు, వారి వారసులు వేదికపై ఉండడం విమర్శలకు కారణమైంది. స్టేడియం వద్ద తొక్కిసలాటో 11మంది మృతి చెందిన సమయంలో విధానసౌధ వద్ద కార్యక్రమం కొనసాగింది. మొబైళ్లు పనిచేయలేదని అందుకే తెలుసుకోలేకపోయామని డీసీఎం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే పోలీసులకు సెట్‌లో సమాచారం ఉంటుంది. వారు అంతపెద్ద సంఘటన చెప్పకుండా ఉండేందుకు వీలులేదు. వీటన్నింటికంటే 11మందిమృతి చెందిన స్టేడియంలో మరోసారి సంబరాలు జరపడం, డీసీఎం డీకే శివకుమార్ పాల్గొనడం తీవ్రమైన విమర్శలకు కారణమవుతోంది. పాలకులంతా తప్పించుకుని రాత్రి పొద్దుపోయేదాకా విధానసౌధలో సీఎం సమావేశం జరపడం, ఆ వెంటనే నగర పోలీస్ కమిషనర్‌తోపాటు ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేయడం విమర్శలకు కారణమవుతోంది. రాష్ట్ర చరిత్రలో బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌పై సస్పెన్షన్ వేటు పడలేదు. పైగా బ్యాటెన్ లేకుండానే సివిల్ డ్రెస్‌లో వచ్చి కొత్త కమిషనర్ బాధ్యతలు తీసుకున్న సందర్భమూ జరగలేదు. వీటన్నింటి అంశాలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం దాటవేసే రీతిలో సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఉంది.



మా భూమి.. మాకే..!

- దాతల పేర్లతోనే సర్కారు బడులు
- రిజిస్ట్రేషన్‌పై దృష్టి పెట్టని విద్యాశాఖ
- హక్కులు తమకే చెందాలంటూ కోర్టుకెక్కుతున్న వారసులు
- సమస్యల్లో 17,824 పాఠశాలలు... 235 కళాశాలలు

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరస్వతీ నిలయాలు ఇబ్బందుల్లో పడ్డాయి. పాఠశాలలు, కళాశాలలను కాపాడుకోవడానికి నేడు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఓ పల్లెలో పాఠశాల ఉంటే కొన్నేళ్ల తర్వాత రూపురేఖలు మారుతాయని లేకుంటే గొర్రెలు, పశువుల కాపరులుగాను, వ్యవసాయ కూలీలుగాను, బాలకార్మికులుగా మిగిలిపోతారని భావించి భూమి ఉచితంగా ఇస్తాం... బడి కట్టండి అంటూ ఎంతోమంది దాతలు ముందుకొచ్చారు. వేలాది ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. వాటిని ప్రభుత్వ ఆస్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపైనే ఉంది. అధికారులు నిర్లక్ష్యం కారణంగా పాఠశాలలు, కళాశాలలు సమస్యలు పడ్డాయి.

రిజిస్ట్రేషన్ పెండింగ్ పాఠశాలలు జిల్లాలవారీగా ..

శివమొగ్గ	1113
తుమకూరు	959
కలబురగి	901
రాయచూరు	743
మండ్య	879
దక్షిణకన్నడ	828
చిత్రదుర్గ	815
మధుగిరి	788
రామనగర	777
హాసన్	704
చిక్కమగళూరు	696
కారవార	685
విజయపుర	675
శిరసి	658
దావణగెరె	592
చిక్కబళ్ళాపుర	519
యాదగిరి	513
మైసూరు	504
కోలారు	457
బీదర్	400
ధారవాడ	390
చామరాజనగర	384
బెంగళూరు దక్షిణ	342
విజయనగర	289
కొప్పళ	270
బళ్ళారి	216
బెంగళూరు ఉత్తర	239
ఉడుపి	225
గదగ్	197
కొడగు	190
హావేరి	172
బెళగావి	159
చిక్కోడి	142
బెంగళూరు గ్రామీణ	132
బాగల్కోట	127

కళాశాలలు జిల్లాలవారీగా

కలబురగి	27
మైసూరు	19
హాసన్	16
మండ్య	15
దావణగెరె	15
శివమొగ్గ	14
తుమకూరు	14
యాదగిరి	12
హావేరి	12
దక్షిణకన్నడ	9
చిత్రదుర	9
ధారవాడ	9
చిక్కమగళూరు	8
బెంగళూరు దక్షిణ	8
కొప్పళ	3
బళ్ళారి	2
రాయచూరు	5
చామరాజనగర	7
కోలారు	6
ఉడుపి	5
కారవార	4
బెంగళూరు ఉత్తర	3
బాగల్కోట	3
గదగ్	2
కొడగులలో	2

రామనగర, విజయపుర, బెంగళూరు గ్రామీణ, చిక్కోడిలలో ఒక్కో కళాశాల పెండింగ్‌లో ఉన్నాయి.



నాడు ఉదారంగా దానం..

అప్పటికాలం వారు ఇచ్చినమాటకు ప్రాధాన్యం ఇచ్చేవారు, ఆమేరకు దానపత్రాలను రాసిచ్చేవారు. వాటికి అనుగుణంగా విద్యాశాఖ సకాలంలో సదరు ఆస్తులను మార్పు చేసుకోకుండా వదిలేశారు. నాలుగైదు దశాబ్దాలకిందట భూములు ఇచ్చినవారు దాదాపు చాలావరకు మృతి చెందారు. ప్రస్తుతం వారి వారసులను ఒప్పించడం విద్య, రెవెన్యూశాఖలకు సవాల్‌గా మారింది. సదరు భూమిని వాపసు ఇస్తే బాగుంటుందని, తాము రాసిచ్చేది లేదంటూ చాలా మంది అభ్యంతరం తెలుపుతున్నారు.

నాడు వందల్లో ఉన్న ధరలు నేడు రూ.లక్షల్లో..


నాలుగైదు దశాబ్దాలకిందట ఎకరం భూమి వందల్లో పలికేది. ఆ తర్వాత వేలకు చేరింది. ఇటీవలి కాలంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధితో భూముల ధరలు కోట్లలో పలుకుతున్నాయి. తాతలకాలంలో ఉచితంగా భూమిని పాఠశాలలకోసం ఇచ్చారు. అప్పట్లో పాఠశాలకు భూమి ఇచ్చామనే గౌరవంతో పాటు నలుగురిలో మంచి పేరు వస్తుందని ముందుకొచ్చారు. రెండుమూడు తరాలు మారేసరికి వారసులు పంచుకోవడం ద్వారా పదుల ఎకరాల భూమి ప్రస్తుతానికి ఎకరం నుంచి రెండు ఎకరాలకు పడిపోయింది. ఒకప్పుడు దానం చేసిన భూమి దక్కించుకుంటే కోట్లు పలుకుతాయని, తమ పిల్లలు ఎవరూ ఈ పల్లెలలో ప్రభుత్వ పాఠశాలలో చదవరని, పైగా వారెప్పుడో మహానగరాలు విదేశాలకు వెళ్లిపోయారని భూమికోసం కోర్టులను ఆశ్రయించినవారు ఉన్నారు. ఒకప్పుడు దానంగా ఇచ్చిన భూమిని కొన్నేళ్ల తర్వాత అయినా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలకు చెందినదిగా రికార్డులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉండేది. విరాళమే ఇచ్చారు... మళ్లీ ఎవరు తిరిగి అడుగుతారులే.. అంటూ అప్పట్లో పదే పదే డిమాండ్ చేయడం సరికాదని అధికారులు నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం అదే పలు సమస్యలకు దారి తీసింది. నాటి దాతల వారసులు భూమిని మళ్లీ పొందేందుకు కోర్టులను ఆశ్రయించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 17,824 ప్రాథమిక నుంచి హైస్కూల్ దాకా, 235 కళాశాలల ఆస్తులు ప్రభుత్వానికి చేరకుండా అయోమయం అయ్యింది.

విద్యాశాఖకు తలనొప్పిగా మారిన వ్యవహారం

గ్రామీణ ప్రదేశాల్లో ఒకప్పుడు అంతగా ధరలు లేవు. గ్రామంలో పెద్ద మనుషులుగాను, సర్పంచ్‌లు ఇతరత్రా హోదాలు కల్గిన వారు, భూస్వాములు ఉదారంగా ఉండేవారు. గ్రామానికి చెందిన పిల్లలు ఎక్కడికి వెళ్లి చదువుకోవాలని పాఠశాలల కోసం భూమిని ఇచ్చారు. కానీ ఇటీవలికాలంలో భూ ముల ధరలు ఆకాశానికి అంటాయి. 30/40 విస్తీర్ణంగల స్థలం రూ.5 లక్షలనుంచి 10లక్షలు పలుకుతోంది. అప్పట్లో ఎకరా, అర ఎకరాతో పాటు ఐదారు ఎకరాలు ఇచ్చిన దాతలూ ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో నలుగురైదుగురు కలసి 10 ఎకరాలకుపైగా ఇచ్చినవారు ఉన్నారు. ఇలాంటి భూములను విద్యాశాఖ దక్కించుకునేందుకు వారి వారసులు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకోవడం, వారందరినీ ఒప్పించడం సాధ్యం కాని అంశంగా మారుతోంది. ఇలా 18వేలకుపైగా స్థలాలు దాతల పేరుతోనే ఉన్నాయి.

కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారసులు

రాష్ట్రంలో 46,460 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 28,636 పాఠశాలల ఆస్తులు విద్యాశాఖకు అనుబంధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. 1175 ప్రభుత్వ కళాశాలలపైకి 940 ఆస్తులు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మిగిలిన ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జిల్లాలవారీగా ప్రక్రియ కొన్నేళ్లుగా సాగుతోంది. జిల్లా అధికారులు కొందరు ప్రత్యేక చొరవచూపి గ్రామాలవారీగా వెళ్లి దాతల వారసులను సంప్రదించి ఒప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. డీడీపీఐ, డీడీపీయూలకు వారసులను కలిపే బాధ్యత అప్పగించారు. కొప్పళ జిల్లాలో 270 పాఠశాలలకు సంబంధించిన ఆస్తులు రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉంది. ఏకంగా 20మంది దాతల వారసులు కోర్టుకు వెళ్లారు. మరి కొంతమంది ఆచూతూచే ధోరణితో వ్యవహరిస్తున్నారు. కోర్టు తీర్పు ఏమొస్తుందో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని, అంతవరకు చర్చలు వద్దని వాయిదా వేస్తున్నారు. అధికారులు మాత్రం ఐదారు దశాబ్దాలుగా పాఠశాల, కళాశాలలు కొనసాగుతున్నాయని, పైగా మీ స్థలలం విద్యాశాఖ అనుభవంలో భూమి ఉందని వాదిస్తున్నారు. 40 ఏళ్లపాటు మీ అధీనంలో లేకున్నా భూమి ఎలా దక్కుతుందని భావిస్తున్నారని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ వేధింపులకు గురిచేస్తే కోర్టును ఆశ్రయిస్తామని కొందరు అధికారులకు సవాల్ విసురుతున్నారు.



సండూరు.. అందాల జోరు..!

- ఈ ఏడాది జూన్‌లోనే అందాలు
- ముందస్తు వర్షాలతో కొండల్లో పచ్చదనం
- పర్యాటకుల రాకతో సందడే సందడి

కొండ ప్రాంతాల్లో నుంచి పారుతున్న నీరు

8



కుమారుడి సమాధిపై పడి రోదిస్తున్న తండ్రి లక్ష్మణ్

భూమిక్ కోసమే..!

- ఈ భూమి కొన్నది నా కుమారుడు భూమిక్ కొరకే
- నన్ను కూడా ఇక్కడే పూడ్చండి..తండ్రి కన్నీరుమున్నీరు
- ఆర్సీబీ సంబరాల్లో మృతుడికి అంత్యక్రియలు

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈ భూమి నా కుమారుడు భూమిక్ కోసమే కొన్నాను. ఇక్కడే వాడి అంత్యక్రియలు చేయాల్సి వచ్చింది.. అంటూ తండ్రి లక్ష్మణ్ కన్నీరుమున్నీరయ్యాడు. ఆర్సీబీ విజయోత్సవాల్లో మృతుల కుటుంబాల్లో విషాదం ఆగడం లేదు. హాసన్ జిల్లా బేళూరులో భూమిక్ అంత్యక్రియలు వారి పొలంలో శనివారం చేపట్టారు. తండ్రి లక్ష్మణ్ కుమారుడి సమాధిపై పడి రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. 'నాకు నా కొడుకు కావాలి..నా కొడుకు ఎక్కడకు పోయాడు అంటూ కనిపించిన వారందరినీ లక్ష్మణ్ అడుగుతున్నాడు. కొడుకు సమాధిపై తలపెట్టి రోదించడం అందరినీ కలచి వేసింది. నన్ను కూడా ఇక్కడే పాతిపెట్టండి అంటూ కన్నీరుమున్నీరయ్యారు. భూమిక్ పెంపుడు కుక్కలు అక్కడే తిరగడం అందరినీ మరింత ఆవేదనకు గురి చేసింది.



ర్యాంప్‌వాక్ చేస్తున్న యువతులు

ఆకట్టుకున్న ఫ్యాషన్‌షో 7

అవకాశం ఆ నలుగురికే..!

- నలుగురు ఎమ్మెల్సీల జాబితా ఖరారు
- సీఎం సిద్దరామయ్య వర్గానికే అధిష్టానం ఆమోదం..
- డీసీఎం డీకే శివకుమార్‌కు చుక్కెదురు..!



ఆరతి కృష్ణ



డీజీ సాగర్




దినేశ్ అమీన్‌మట్టు



రమేశ్‌బాబు

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. సీఎం, డీసీఎంలు తమ వారికి పరిషత్‌లోకి అవకాశం దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో సీఎం సిద్దరామయ్యదే పైచేయి అయ్యింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీఎం పంపిన జాబితాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డీసీఎం డీకే శివకుమార్ సూచించిన పేర్లను పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. దీంతో డీకేకు చుక్కెదురు అయినట్లు తెలుస్తోంది. పాత్రికేయుడు దినేశ్ అమీన్ మట్టు పేరు సీఎం సిద్దరామయ్య ప్రతిపాదించారు. ఇక దళితనేత డీజీ సాగర్ పేరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. ఇక కాంగ్రెస్ అధికార ప్రతినిధితోపాటు ప్రవాసభారతీయ విభాగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆరతి కృష్ణల పేర్లను సీఎం సిఫారసుతో అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో సీఎంకు సన్నిహితంగా ఉండే ముగ్గురు ఖరారయ్యారు. డీకే శివకుమార్ సిఫారసు చేసినవారిలో వినయ్‌కార్తీక్, బీఎల్ శంకర్‌ల పేర్లు ఉన్నట్లు సమాచారం. వారిద్దరికీ చాన్స్ దక్కలేదు. దీంతో డీసీఎం వర్గీయుల్లో కాస్త అసంతృప్తి నెలకొంది. కులాల ఆధారంగా కూడా ప్రాధాన్యం ఇచ్చారు. డీజీ సాగర్ దళిత వర్గానికి చెందినవారు కాగా, ఆరతికృష్ణ ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు. రమేశ్‌బాబు, దినేశ్ అమీన్‌మట్టులు బీసీ సామాజికవర్గానికి చెందినవారు. నామినేటెడ్ ఎమ్మెల్సీగా కొనసాగిన యూబీ వెంకటేశ్, ప్రకాశ్‌రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. జేడీఎస్‌కు చెందిన తిప్పేస్వామి పదవీకాలం కూడా ఇటీవలే ముగిసింది. ఇలా బీజేపీ ఎమ్మెల్సీగా కొనసాగి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి చన్నపట్టణ స్థానంనుంచి ఎమ్మెల్యేగా సీపీ యోగేశ్వర్ గెలుపొందిన సంగతి విదితమే. దినేశ్ అమీన్‌మట్టు సీఎం వర్గంగా గుర్తింపు పొందినవారే, జేడీఎస్ నుంచి వచ్చిన రమేశ్‌బాబుకు గతంలో అవకాశం లభించలేదు. ఆయన ఎంపిక పట్ల కొంత అసంతృప్తి ఉన్నా విధానపరిషత్‌లో సుదీర్ఘకాలం కొనసాగిన అనుభవానికి ప్రాధాన్యం ఇచ్చారు. 4 స్థానాలలో సీఎం సిద్దరామయ్యకు సన్నిహితులైనవారు ముగ్గురు కాగా మల్లికార్జున ఖర్గే కోటా నుంచి ఒకరు ఉన్నారు.



చామరాజపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

త్యాగం, దానం..

- అదే బక్రీద్ పరమార్థం.. చాటి చెప్పిన మతగురువులు..రాష్ట్ర వ్యాప్తంగా పండుగ సందడి


బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి, దానానికి ప్రతీక బక్రీద్ అని మతగురువులు చాటి చెప్పారు. శనివారం బక్రీద్ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ శనివారం బక్రీద్ సందడి నెలకొంది. ఉదయం ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. మత గురువులు, ముతవల్లీలు ఖురాన్‌లోని ప్రధాన ఘట్టాలను చదివి వినిపించారు. బక్రీద్ అంటే త్యాగం, దానానికి ప్రతీక అని పిలుపునిచ్చారు. ఆ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకొన్నారు. బక్రీద్ పండుగ అంటే గొర్రెలను బలి ఇచ్చి వాటి మాంసాన్ని బంధుమిత్రులకు దానం చేసే సంప్రదాయాన్ని పాటించారు. చామరాజపేట ఈద్గా మైదానంలో మంత్రి జమీర్ అహ్మద్ ప్రార్థనలు చేశారు. బీదర్‌లో మరో మంత్రి రెహమాన్‌ఖాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, కేంద్రమంత్రి కుమారస్వామి సహా ప్రముఖులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిచోటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో ఆర్‌టీనగర్, ఖుద్దూస్ మైదానం, బన్నేరుఘట్టరోడ్డు, కనకపుర రోడ్డు, మైసూరు రోడ్డుతోపాటు పలు ప్రాంతాలలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రార్థనల్లో చిన్నారులు



కెమెరాతో నిఘా



ప్రార్థనలకు తరలివెళ్తున్న ముస్లింలు

మత్తుగా.. గమ్మత్తుగా..!



ధర్మవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపై శనివారం ఉదయం 7 గంటలకే ఇద్దరు యువకులు హల్‌చల్ చేశారు. వారు మద్యం సేవించి రోడ్డుపై పడి దొర్లుతూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగించారు. వాహనదారులు, ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అనంతరం స్థానికులు మందలించి యువకులను అక్కడి నుంచి పంపించేశారు.

యువకుల ఘర్షణ.. ఒకరి మృతి



యశ్వంత్‌కుమార్ (ఫైల్)

గార్లదిన్నె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పెనకచెర్లలో ఇద్దరు యువకుల మధ్య కొన్నాళ్లుగా జరుగుతున్న ఘర్షణ కారణంగా ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు చితంబరయ్య కుమారుడు యశ్వంత్‌కుమార్ (16), రామాంజినేయులు కుమారుడు దివాకర్ చితంబరప్ప స్వామి తిరునాళ్ళల్లో గొడవపడ్డారు. యశ్వంత్ దాడిలో తీవ్రంగా గాయపడిన దివాకర్ కోమాలోకి వెళ్లాడు. చికిత్స అనంతరం కోలుకుని ఇటీవల ఇంటికి వచ్చాడు. తనపై దాడిచేసిన యశ్వంత్‌పై కోపం పెంచుకున్నాడు. అతనిపై దాడిచేసి తీవ్రంగా గాయపరచాలని అనుకున్నాడు. శనివారం ఉదయం యశ్వంత్‌తో గొడవకు దిగాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపారు. యశ్వంత్‌కుమార్ గొర్రెలను మేపేందుకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి వెళుతుండగా, దివాకర్ కర్రతో బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన యశ్వంత్‌ను 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య గ్రామానికి వెళ్లి విచారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కట్నం కేసు నమోదు

యాడికి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కట్నం కోసం వేధిస్తున్నారని ఐశ్వర్య అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త విష్ణువర్ధన్, మామ కుళ్లాయప్పపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటరమణయ్య శనివారం తెలిపారు. చందన గ్రామానికి చెందిన ఐశ్వర్య నార్పల మండలం కేశేపల్లికి చెందిన సమీప బంధువు విష్ణువర్ధన్‌ను ఇష్టపడి ఏడాది క్రితం పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల తరువాత కట్నం కోసం భర్త, మామ వేధిస్తున్నారని ఐశ్వర్య ఫిర్యాదు చేశారు.

కామర్స్ లెక్చరర్ మృతి



హబీబుద్దీన్(ఫైల్)

అనంతపురం సెంట్రల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలపాటు విద్యార్థులకు పాఠాలు బోధించిన సీనియర్ లెక్చరర్ సిద్దవటం హబీబుద్దీన్(62) మృతిచెందారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. హబీబుద్దీన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగరంలోని పాతూరుకి చెందిన హబీబుద్దీన్.. ఎస్కేయూలో ఎంకాం పూర్తిచేశారు. బోధనావృత్తిని ఎంచుకుని 40ఏళ్లుగా వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల్లో కామర్స్ పాఠాలు చెబుతూవచ్చారు. శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదరరెడ్డి అధ్యక్షతన హబీబుద్దీన్ మృతికి సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

పాతకక్షలతో దాడి



ధ్వంసమైన వాహనం

తాడిపత్రి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న జిలాన్‌బాషా ఇంటిపై దాడిచేసి అతడి భార్య షేకున్, కుమారుడు మస్తాన్, కూతురు అర్ఫిపై దాడిచేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. జిలాన్‌బాషా మెకానిక్ పనులు చేసేవాడు. కొంతకాలం క్రితం ఇంటి సమీపంలో ఉన్న ఖాళీస్థలంలో షఫి, రహంతుల్లా, బాబావలి, షంషూర్ మద్యం సేవించేవారు. అప్పట్లో వారిని మందలించి పోలీసులకు పట్టించారనే కోపంతో శనివారం మద్యం మత్తులో ఇంటిలోకి దూరి వారిని చితకబాది షేకున్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచారు. ఇంటిలోని వస్తువులను చిందరవందర చేసి చంపుతామంటూ బెదిరించారు. అసభ్యంగా ప్రవర్తించారని షేకున్‌బీ వాపోయారు. ద్విచక్రవాహనాన్ని, కారును ధ్వంసంచేసి పారిపోయారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోకు రూ.11,200 జరిమానా



జరిమానా వేసింది ఈ ఆటోకే

అనంతపురం క్రైం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు కుక్కి తీసుకువెళుతున్న ఆటోకు నాలుగో పట్టణ పోలీసులు రూ.11,210 జరిమానా విధించారు. నారాయణపురంలో సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఓ ఆటోకు కాంక్రీట్ మిల్లర్ తగిలించి, 15 మంది కూలీలను తీసుకువస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవడంతో ఆర్టీఏ అధికారులకు సిఫార్సు చేశారు. వారు రూ.11,200 జరిమానా వేశారు.

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రస్తుతం వేసవి సెలవులు ముగింపు సమయం కావడంతో విద్యార్థులు, భక్తులు భారీగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ అధికారులు అన్నదాన సౌకర్యం కల్పించారు.



స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

బదిలీల పంచాయితీ..?

గ్రేడ్-4 కార్యదర్శులకు తప్పని నిరాశ

గ్రేడ్-4 అడిషినల్ పేరుతో గ్రేడ్-5కు అందలం

లబోదిబోమంటున్న గ్రేడ్-4 కార్యదర్శులు



డీపీఓ కార్యాలయం (ఫైల్ ఫొటో)

అనంతపురం న్యూటౌన్ జూన్ 7(ఆంధ్రజ్యోతి) బదిలీల్లో భాగంగా జిల్లాలోని గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులకు మొండి చేయి చూపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రేడ్-4 కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించకుండానే గ్రేడ్-5 కార్యదర్శుల్లో కొందరికి గ్రేడ్-4 అడిషినల్ కింద బదిలీ చేశారు. దీంతో ఆ స్థానంలో వెళ్లాలని వేచి చూస్తున్న అర్హులైన గ్రేడ్-4 కార్యదర్శులకు నిరాశ మిగిలింది. లేని గ్రేడ్‌ను సృష్టించి లేనిపోని సమస్యలు తెచ్చిపెడుతున్నారని పలువురు అర్హులైన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిషినల్ గ్రేడ్-4 ఎక్కడ నుంచి వచ్చింది?

పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రేడ్-4 అడిషినల్ అనే గ్రేడ్ లేదు. గత ప్రభుత్వం మాటమాత్రంగా చెప్పిందే కానీ ఉత్తర్వులు ఇవ్వలేదు. అయితే గత ఏడాది సాధారణ బదిలీల్లో భాగంగా అప్పటి అధికారులు అప్పటి ప్రభుత్వ పెద్దల మెప్పు పొందడానికి గ్రేడ్-4 అడిషినల్ కింద స్థానిక నాయకులు సూచనల మేరకు వారు చెప్పిన వారిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారు. ఆ బదిలీ స్థానాల్లో వీరికి తగిన అర్హత లేదన్న ఉద్దేశంతో అక్కడ పొజిషన్ ఐడీలు లేక వేతనం తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇలా ఉమ్మడి జిల్లాలో 96 మంది ఇబ్బంది పడ్డారు. వీరిలో 33 మంది వారికి ఉన్న పరిచయాలతో ఉన్నతాధికారులను మెప్పించి పొజిషన్ ఐడీలు తెచ్చుకుని, వేతనం తీసుకోగలిగారు. ఇదే తరహాలో మిగిలిన వారికి కూడా వేతనం మంజూరు అయ్యేలా చూడాలని ఉన్నత అధికారులు ఎందుకు చెప్పలేకపోయారన్నది ప్రశ్నార్థకరంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం సాధారణ బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసే వరకు కూడా ఉన్నతాధికారులు తమకేం పట్టదన్నట్లు వ్యవహరించారు. ఉత్తర్వులు రాగానే సమస్యను పరిష్కరించకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని బదిలీల కంటే ముందుగానే ఖాళీ స్థానాల్లో గ్రేడ్-4 అడిషినల్ కార్యదర్శులను బదిలీ చేశారు. ఆమేరకు గెజిట్ విడుదల చేసి కలెక్టర్ ఆమోదంతో పంచాయతీరాజ్ కమిషనర్ ఆమోదానికి పంపారు. దీంతో ఆ స్థానంలో గ్రేడ్-4 కార్యదర్శులుగా బదిలీపై వెళ్లాలనుకొనేవారికి అవకాశం లేకుండా చేశారు. గ్రేడ్-4 అడిషినల్ వారిని బదిలీ చేసిన తరువాత 20 మంది గ్రేడ్-4 కార్యదర్శులకు మాత్రమే బదిలీలు చేశారు.

చట్టంలోనే లేదు..

అడిషినల్ గ్రేడ్-4 అన్నది పంచాయితీరాజ్ చట్టంలోనే లేదు. లేని గ్రేడ్ ను అధికారులు ఎందుకు అమలు చేస్తున్నారన్నది అర్థం కాని ప్రశ్న. కూటమి ప్రభుత్వం చట్ట సవరణలో భాగంగా గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకే పంచాయతీలను అమలు చేస్తోంది. అంటే వైసీపీ ప్రభుత్వంలో సచివాలయంలో నియమితులైన గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులు పంచాయతీలకు నియమించడానికి వీలు లేదు. అయితే అధికారులు అత్యుత్సాహంతో గ్రేడ్-5 కార్యదర్శులను అడిషినల్ గ్రేడ్-4 పేరుతో గ్రేడ్-4 కార్యదర్శుల స్థానంలో నియమిస్తుండటంతో సమస్యలు తలెత్తుతు న్నాయి. దీనిపై యూనియన్ తరఫున గ్రేడ్-4 కార్యదర్శులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

ముమ్మాటికీ దేవతల రాజధానే..!

మాజీ మేయర్ స్వరూప



అనంతపురం అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే అని, భూములను త్యాగాలు చేసిన అమ్మల రాజధాని అని మాజీ మేయర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు స్వరూప అన్నారు. నగరంలోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్ అనే సైతాన్‌ను తరిమేసిన అన్ని మతాల దేవతలు, దేవుళ్లు కొలువైన రాజధాని అమరావతి అని అన్నారు. కన్నతల్లిని, సొంత చెల్లిని తరిమేసిన జగన్‌కు మహిళల త్యాగాలు, గొప్పతనం గురించి ఎలా తెలుస్తుందని విమర్శించారు. మహిళలంటే గౌరవం లేని జగన్ రెడ్డిని చూసి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మహిళలకు తక్షణమే జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు ముసుగులో ఉన్న పేటీఎం కృష్ణం రాజు, కొమ్మినేని శ్రీనివాస్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరావతిపై విషం కక్కుతారా..?

ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిగా ఉండటం వైసీపీ నాయకులకు మొదటి నుంచి ఇష్టం లేదని, అందుకే ఏదో విధంగా విషం కక్కుతూనే ఉన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రభుత్వం, సీఎం చంద్రబాబు గురించి నేరుగా మాట్లాడితే సమాధానం ఇస్తామని, ఇలా అమరావతిపై విషం చిమ్మడం సిగ్గు చేటని అన్నారు. అమరావతి వేశ్యల రాజధాని అనడం మహిళలను కించపరచడమే అని అన్నారు. 'మీ మీడియాతో ఇంత ఘోరంగా మహిళలను అవమానపర్చవచ్చా?' అని జగన్‌ను నిలదీశారు. ఇలాంటి ప్రచారాలు చేస్తున్న వారి ఇళ్లలో మహిళలు ఉన్నారా లేదా అనే అనుమానం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను త్యాగాలు చేసిన అమ్మల రాజధాని అమరావతి అని, ముమ్మాటికి దేవతల రాజధానే అని అన్నారు. మహిళలను అవమాపరిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. వైసీపీ నాయకులు మహిళలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కూలీల వాహనాన్ని ఢీ కొట్టిన లారీ



కూలీల బొలెరో వాహనాన్ని ఢీ కొట్టిన లారీ

ఒకరి మృతి.. 27 మందికి గాయాలు



మృతి చెందిన గంగమ్మ



గాయపడిన కూలీలు

గార్లదిన్నె, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, 27 మంది గాయపడ్డారు. చీనీ తోటలో పనులు ముగించుకున్న కూలీలు.. బొలెరోలో తిరిగి వెళుతుండగా లారీ ఢీ కొట్టింది. దీంతో కల్లూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గంగమ్మ(45) అక్కడిక్కడే మృతి చెందారు. గార్లదిన్నె మండల కల్లూరు, ఎగువపల్లి గ్రామాలకు చెందిన శివమ్మ, పుల్లమ్మ, నాగలక్ష్మి, దేవమ్మ, చిన్న పుల్లక్క, దేవక్క, పార్వతమ్మ, పెద్ద అమ్ములు, నాగేంద్ర, నాగజ్యోతి, మణికంఠ, ఈరమ్మ, బాలచిన్న పుల్లమ్మ, తిప్పమ్మ సహా 27 మంది గాయపడ్డారు. వీరిలో బాలచిన్న పుల్లమ్మ, నాగలక్ష్మి, మల్లేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. కూలీలు ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చీనీ పండ్లు కోసేందుకు వెళ్లారు. వీరి వాహనం తిమ్మంపేట వద్దకు రాగానే అనంతపురం వైపు నుంచి గుత్తి వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో బొలెరో రోడ్డుపై పల్టీలు కొట్టింది. లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో బొలెరోకు ప్రమాదం జరిగిందని కొందరు అంటున్నారు. ప్రమాదానికి కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది. గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం 108 వాహనాల ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. వాహనంలో 35 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం.

వెబ్ కౌన్సెలింగ్ వద్దే వద్దు..!

● మాన్యువల్‌గా నిర్వహించాలి ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ ● ఎస్‌జీటీ బదిలీలపై వివాదం



వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సెకెండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని మెజార్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వెబ్ కౌన్సిలింగ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు వారు ప్రకటించారు. షెడ్యూల్ మేరకు శనివారం నుంచి 10వ తేదీ వరకూ ఎస్‌జీటీలు బదిలీలకు వెబ్ ఆప్షన్లు పెట్టాలి. అయితే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విద్యాశాఖ కమిషనర్ గతంలో తమకు మాట ఇచ్చారని, ఇప్పుడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని సంఘాల నేతలకు విమర్శిస్తున్నారు. అన్ని మండల వనరుల కేంద్రాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిషనర్ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. టీచర్లు వెబ్ ఆప్షన్లు పెట్టుకోడానికి వీలుగా మండల వనరుల కేంద్రాల్లో కంప్యూటర్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. జిల్లా విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఆ దిశగా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమౌతున్నారు.

వ్యతిరేకిస్తున్న సంఘాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,626 మంది ఎస్‌జీటీలు బదిలీలకు దరఖాస్తు చేశారు. వీరిలో 3,085 మంది తప్పనిసరి, 1,541 మంది రిక్వెస్టు బదిలీ జాబితాలో ఉన్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇస్తే.. 11వ తేదీన బదిలీల ఉత్తర్వులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు భావించారు. షెడ్యూల్ మేరకు గడువులోగా పూర్తి చేయాలనే తలంపుతో పాఠశాల విద్యాశాఖ ముందుకెళుతోంది. సంఘాల నాయకులు మాత్రం గతంలో కమిషనర్ ఇచ్చిన మాట మేరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. వెబ్ కౌన్సెలింగ్ పెట్టరాదని డిమాండ్ చేస్తున్నారు. ఎవరూ ఆన్‌లైన్‌లో ఆప్షన్లు పెట్టవద్దని టీచర్లకు సూచించారు. ఈ వ్యవహారంలో సామాన్య టీచర్లు తటస్థంగా ఉంటున్నారు.

నేడు డీఈఓ ఆఫీస్ ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని ఐక్యవేదిక నాయకులు నాగిరెడ్డి, వెంకటరత్నం తెలిపారు. మాన్యువల్ కౌన్సెలింగ్ జరుపుతామని మాట ఇచ్చి, వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారని విమర్శించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆదివారం ఉదయం 10 గంటలకు డీఈఓ ఆఫీస్‌ను ముట్టడిస్తామని, ఐక్యవేదిక నాయకులు, టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి సవిత దురుసు ప్రవర్తన.. అవాస్తవం

● తహసీల్దార్ శ్రీధర్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పెనుకొండ టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపు ప్రారంభోత్సవంలో మంత్రి సవిత రెవెన్యూ అధికారులపై దురుసుగా వ్యవహరించారని చేస్తున్న ప్రచారం అవాస్తవమని పెనుకొండ తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వోలు తేజ, బషీర్, యశస్విని లతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1న ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రెండు ఎఫ్‌పీ షాపులు ప్రారంభోత్సవం జరిగాయన్నారు. మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చేతన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారన్నారు. ఈ క్రమంలో మంత్రి సవితకు సీఎస్‌డీటీ ప్రభావతి బొకేను అందించారన్నారు. మంత్రి బొకేను తీసుకొని తన వెనుక ఉన్న గన్‌మెన్‌కు అందించే క్రమంలో పుష్పగుచ్ఛం కిందకు జారిపడిందన్నారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసి మంత్రి దురుసు ప్రవర్తనంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి సవిత ఏడాది నుంచి అధికారులతో సౌమ్యంగా ఉన్నారని, ఎన్నడూ దురుసుగా ప్రవర్తించింది లేదన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సెకెండ్ ఇయర్‌లో 3,128, ఫస్ట్ ఇయర్‌లో 3,336 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మొత్తం 6,464 మంది పాసయ్యారు. ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో 4,545 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3,128 మంది ఉత్తీర్ణుయ్యారు. జిల్లా వ్యాప్తంగా 69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 7వ స్థానం దక్కింది. ఫస్ట్ ఇయర్‌లో 7,404 మంది హాజరుకాగా 3,336 మంది విద్యార్థులు పాసయ్యారు. 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో 14వ స్థానం దక్కింది. విద్యార్థులు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. రీ వెరిఫికేషన్‌కు రూ. 1300, రీ కౌంటింగ్‌కు రూ.260 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

చీనీ టన్ను రూ.32వేలు

అనంతపురం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.32,240 ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3,980, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 505టన్నుల చీనీకాయలు వచినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు

అనంతపురం న్యూటౌన్ జూన్ 7 (ఆంధ్రజ్యోతి) సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శుల బదిలీలు శనివారం జరిగాయి. డీపీఓ నాగరాజనాయుడు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలో గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శులకు సంబంధించి ఐదేళ్లు ఒకే చోట పని చేసిన వారు, వివిధ కారణాలతో వినతులు పెట్టుకున్న వారికి సంబంధించి ఏడుగురిని బదిలీ చేశారు. గ్రేడ్-4కు సంబంధించి 20 మంది కార్యదర్శులను బదిలీ చేశారు. అలాగే ఉమ్మడి జిల్లా గ్రేడ్-4 అడిషినల్ కింద పొజిషన్ ఐడీ చూపించడంలో భాగంగా 60 మందినిబదిలీ చేశారు.

సెక్రటరీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
చంద్రశేఖర్	ఆత్మకూరు	కొనకొండ్ల
వెంకటేశ్వర ప్రసాద్	కొనకొండ్ల	కొరడికొండ
సాదిక్‌వలి	కొరడికొండ	ఆత్మకూరు
అశ్వత్థమనాయుడు	యాడికి	పామిడి
గోపాల్	పామిడి	యాడికి
చంద్రశేఖర్	గార్లదిన్నె	చెన్నేకొత్తపల్లి
ముత్యాలరెడ్డి	బత్తలపల్లి	గార్లదిన్నె

గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు

సెక్రటరీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మహబుబ్‌బాషా	ఆమిద్యాల	కసాపురం
మల్లికార్జున	ఊరిచింతల	కొర్రపాడు
మహమ్మద్ రఫీ	కుందిర్పి	జంతులూరు
రామాంజినేయులు	మర్తాడు	సిద్దరాంపురం
బాలరామమూర్తి	సజ్జలదిన్నె	చిన్నపొలమడ
లీలారాణి	శింగనమల	పొడరాళ్ల
ఖాదర్‌వలి	పెనకచర్ల	కే కే అగ్రహారం

సూపర్ స్పెషాలిటీకి నాలుగు పీజీ సీట్లు

అనంతపురం టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మరో నాలుగు పీజీ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేసిందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శనివారం తెలిపారు. న్యూరో సర్జరీ విభాగానికి ఈ నాలుగు పీజీ సీట్లను మంజూరు చేశారని, ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్‌లు పొందడానికి అవకాశం కల్పించారని తెలిపారు. .పీడియాట్రిక్ సర్జరీ విభాగానికి నాలుగు పీజీ సీట్లు మంజూరు చేయాలని ఎన్ఎంసీని కోరామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. అనంత వైద్యకళాశాల ఏ గ్రేడ్‌కు చేరుకుందని, ఇది మరింత ఆనందకరమని అన్నారు.

అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం



తాళం వేయడంతో ఇంటి ముందు కూర్చున్న గంగమ్మ కుటుంబ సభ్యులు

హిందూపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చలేదని ఇంటికి తాళం వేసిన సంఘటన హిందూపురం మండలం గోళ్లాపురంలో శనివారం చోటుచేసుకుంది. దీనిపై బాధితురాలు గంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త హనుమప్పకు రూ.50 వేలు ఇచ్చామని అప్పలకుంటకు చెందిన అంజక్క, ఆమె కుమారుడు సుధాకర్ కొన్నాళ్ల నుంచి వేధిస్తున్నారని గంగమ్మ తెలిపారు. తన భర్త ఐదేళ్ల క్రితమే మృతి చెందాడని, ఇప్పుడు వచ్చి అప్పు అంటున్నారని, ఆధారాలను కూడా చూపడం లేదని వాపోయారు. డబ్బులు ఇవ్వలేదని తమను బయటకు గెంటేసి, ఇంటికి తాళం వేసుకున్నారని తెలిపారు. విచారించి న్యాయం చేస్తామని సీఐ ఆంజినేయులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంతకల్లు టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్స్, రైళ్లలో ప్రయాణికుల బ్యాగ్‌లు, వెయిటింగ్ హాల్, పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

ప్రతి విద్యార్థికి కిట్టు అందాలి

● నోడల్ ఆఫీసర్ సుబ్బారావు

అనంతపురం విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి విద్యార్థిమిత్ర కిట్టు అందేలా చూడాలని విద్యాశాఖ జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లాల నోడల్ ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలించారు. అనంతపురం ఏపీసీ శైలజతో కలసి అనంతపురం, బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లోని స్టాక్‌పాయింట్లతోపాటు పలు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....ఈ నెల 12వ తేదీ విద్యార్థులకు అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ నారాయణ స్వామి, వేణుగోపాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బత్తలపల్లి /ఓబుళదేవరచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలాలపరిధిలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ సమీపంలోఉదయం ఎద్దుల బండిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో వీరనారప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవ రం రూరల్ మండలం గొట్లూరుకు చెందిన వీరనారప్ప వ్యవసా య పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజూ మాదిరి గానే వ్యవసాయ పనులపై ఎద్దులబండిని తోలుకుంటూ వేల్పుమడుగు గ్రామానికి వెళ్తున్నాడు. క్రాస్ సమీపంలో వెనుక నుంచి గు ర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరనారప్ప తీ వ్రంగా గాయపడ్డాడు. రెండు ఎద్దులకు తీవ్ర గాయలయ్యాయి. బండి పూర్తిగా దెబ్బతింది. ఆ దారిలో వెళ్తున్న వాహనదారులు గ మనించి వీరనారప్పను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీ లించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే బత్తలపల్లి మండలం జ్వాలాపురం క్రాస్ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి ఒకరు గాయపడ్డారు. కడప పట్టణానికి చెందిన శ్రీనివాసులు కడప నుంచి ఆటోలో అనంతపురం వైపు వెళ్తున్నాడు. జ్వాలాపురం క్రాస్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ దారిలో వెళ్తు న్న వాహనదారులు అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే పంచాయతీలోని బండకిందపల్లికి చెందిన రాము, రవి శనివారం ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి మండల కేంద్రమైన ఓబుళదేవరచెరువుకు వెళ్తున్నారు. వెంకటా పురం మలుపు వద్ద వాహనం అదుపు తప్పి వారిద్దరు కిందపడిన ట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిద్దిరిని స్థానికులు 108 వాహనంలో కదిరికి తరలించారు.

నేడు ఉచిత కంటి పరీక్ష శిబిరం

నంబులపూలకుంట, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌకనపల్లి క్రాస్ సమీపంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామాంజులరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రిఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. ఈ శిబిరానికి హాజరైన వారికి ఉచిత భోజనం, రవాణా సౌకర్యం, ఉచిత ఆపరేషన్లు ఉంటాయ న్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యనిర్వాహకులు రామాంజులరెడ్డి, లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

వేదాంతం రాఘవయ్య (జయంతి)



వేదాంతం రాఘవయ్య 1919 జూన్ 8న కృష్ణా జిల్లా కూచిపూడిలో జన్మించారు. సినీ కొరియోగ్రాఫర్, నటుడు, కూచిపూడి కళాకారుడు, నృత్య దర్శకుడు, సంగీతకారుడు, దర్శక, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు, తమిళ భాషలలో నాటక, సినీ రంగానికి ఎన్నో సేవలందించారు. 'భారతకళా ప్రపూర్ణ' పురస్కార గ్రహీత. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ తొలి జనరల్ కౌన్సిల్‌లోనూ, జాతీయ నృత్యోత్సవానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. వినోద్ పిక్చర్స్‌కు సహ భాగస్వామ్యం కలిగారు. రైతుబిడ్డ, స్వర్గసీమ సినిమాలకు కొరియోగ్రఫీ అందించారు. దేవదాసు, అన్నదాత, అనార్కలి, చిరంజీవులు, సువర్ణ సుందరి తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. 1971లో కన్నుమూశారు.

కేఎన్ కేసరి (వర్ధంతి)



ఆయుర్వేద వైద్యులుగా చిరపరిచితులైన డాక్టర్ కేఎన్ కేసరి 1875 ఏప్రిల్ 26న ప్రకాశం జిల్లా ఇనమనమెళ్ళూరు గ్రామంలో జన్మించారు. అసలు పేరు కోట నరసింహం. 'కేసరి కుటీరం' అనే ఔషధశాల స్థాపకుడు. కర్ణాటక సంగీత విద్వాంసుడు, గాయకుడైన 'ఉన్ని కృష్ణన్' ఆయన మునిమనమడు. 1928లో 'గృహలక్ష్మి' అనే తెలుగు వార పత్రికను స్థాపించి వ్యవస్థాపక సంపాదకుడిగా మహిళా రచయితలను ప్రోత్సహించారు. 'గృహలక్ష్మి స్వర్ణ కంకణం' పురస్కారాన్ని స్థాపించారు. 'కేసరి విద్యా సంస్థ' స్థాపించగా నేటికీ అనేక పాఠశాలలను సంస్థ నిర్వహిస్తోంది. 1953 జూన్ 8న కన్నుమూశారు.

స్వామి పార్థసారథి (పుట్టినరోజు)



స్వామిజీగా 'కార్పొరేట్ గురు'గా చిరపరిచితులైన ఆవుల పార్థసారథి 1927 జూన్ 8న చెన్నైలో జన్మించారు. తత్వవేత్త, వేదాంతాలపై పట్టు కలిగినవారు. లండన్ యూనివర్శిటీలో పీజీ చేసిన ఆయన ఆరు దశాబ్దాలకుపైగా తత్వబోధనలు చేస్తున్నారు. 1988లో వేదాంత అకాడమీని నెలకొల్పి వేద అధ్యయన కోర్సులు నిర్వహిస్తున్నారు. అనువాదం చేయడమే కాక 12 పుస్తకాలు రచించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ సదస్సులలో ప్రసంగిస్తున్నారు. అంతేకాక బుల్లితెరపై కూడా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

మాడుగుల నాగఫణిశర్మ (పుట్టినరోజు)



మాడుగుల నాగఫణిశర్మ అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా పుట్లూరు మండలం కడవకొల్లు గ్రామంలో 1959 జూన్ 8న జన్మించారు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఏంఎ, న్యూఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శిక్షాశాస్త్రి, తిరుపతి రాష్ట్రీయ విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పొందారు. సంస్కృత ఉపన్యాసకులుగా, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్తు అదనపు కార్యదర్శిగా పనిచేశారు. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి, మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మల సమక్షంలో అవధానం నిర్వహించి ప్రశంసలు పొందారు. శతావధాని సామ్రాట్, సహస్రావధాని, బృహత్ ద్విసహస్రావధాని, సహస్రఫణి, శతావధాన చూడామణి తదితర బిరుదులు, స్వర్ణకంకణం, గండ పెండేరం పొందారు. పలుచోట్ల కనకాభిషేకాలు పొందారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉషా ఇంటర్నేషనల్‌కు అనుబంధమైన పెర్ల్ అకాడమీ ఆధ్వర్యంలో పోర్ట్‌ఫోలియో 25 పేరిట నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. బార్బీ సూయింగ్ స్టూడియో, లైవ్ సూయింగ్ ప్రదర్శనల అనుభవాలు ప్రదర్శించారు. ఫ్యాషన్ ప్రతిభ ప్రతి విద్యార్థిలోనూ తీసుకు రావడమే లక్ష్యంగా శిక్షణలు ఇచ్చినట్టు డీన్ మౌరిజియో డియోలి తెలిపారు. సాంస్కృతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ఉషా ఇంటర్నేషనల్ ఫ్యాషన్ అండ్ క్రాఫ్ట్ స్టూడియో చైర్మన్ సీమా మహాజన్ మాట్లాడుతూ పెర్ల్ అకాడమీతో ఒప్పందం తర్వాత ఫ్యాషన్ రంగంలో ఆసక్తి కల్గిన యువతను ప్రోత్సహించే దిశగా శిక్షణలు ఇస్తున్నామన్నారు.

ఉదిరిపికొండలో దాహం..దాహం..!

● ప్రధాన రహదారిపై ప్రజల ఆందోళన

కూడేరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉదిరిపికొండ గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకు అధికమవుతోంది. నీళ్ల కోసం గ్రామస్థులు సమీపంలోని తోటలకు పరుగులు తీస్తున్నారు. పది రోజులుగా నీటి సమస్య ఉన్నా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక సర్పంచు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోవడంతో శనివారం సాయంత్రం స్థానికులు అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. స్థానికులు మాట్లాడుతూ పదిరోజులుగా తాగునీరు లేక అల్లాడిపోతుంటే ఒక్కరు కూడా పట్టించుకోలేదన్నారు. తాగునీటి కోసం ఎడ్లబండ్లు, సైకిళ్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏబీఆర్ డ్యాం నుంచి నీటి సరఫరా లేకపోవడంతోనే కష్టాలు అధికమయ్యాయని అంటున్నారు.



అనంతపురం-బళ్లారి రహదారిపై ఖాళీ బిందెలతో గ్రామస్థుల నిరసన



చింతామణి ఈద్గా మైదానంలో ప్రార్థనలు



బాగేపల్లి ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనలు



బంగారపేటలో ఈద్గా మైదానానికి తరలుతున్న ముస్లింలు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

» మత పెద్దల ఉద్బోధ

బాగేపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను పురస్కరించుకుని పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా ఈద్గా మైదానాలలో శనివారం ముస్లింలు విశేష ప్రార్థనలు చేశారు. పట్టణంలోని జామియా మసీదు సహా 16కు పైగా మసీదులనుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో ప్రధానరహదారి మీదుగా ర్యాలీగా సాగారు. అల్లాహు అక్బర్ అంటూ స్మరించారు. కొడికొండరోడ్డులోని ఈద్గా మైదానానికి ఉదయం 7.30 గంటలకు చేరుకున్నారు. పెద్దలు, పిల్లలు వరుసక్రమంలో నిలబడి పండుగ ప్రత్యేక నమాజ్ చేశారు. పట్టణానికి చెందిన ధర్మగురువు మౌలానా రిజ్వాన్ అర్షద్ అహ్మద్ బక్రీద్‌యొక్క విశేషాలను వివరించారు. ముస్లింలు నమాజ్, హజ్, రోజా, జకాత్, సిత్రా అనే పంచసూత్రాలను పాటించాలన్నారు. తద్వారా అల్లా కృప సాధ్యమన్నారు. త్యాగం అన్నింటి కంటే గొప్పదని బక్రీద్ ప్రత్యేకత అదే అన్నారు. తాలూకా వ్యాప్తంగా పలుచోట్ల బక్రీద్ ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. పరస్పరం ఈద్ ముబారక్ తెలిపారు. కాగా స్మశానాల వద్ద తమ కుటుంబీకుల సమాధులకు పూలు, సుగంధద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు.

బంగారపేటలో...

బంగారపేట: పట్టణంలోని దర్గా మైదానంలో బక్రీద్‌ను పురస్కరించుకుని శనివారం విశేష ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ అయిన రెండు నెలలకు బక్రీద్ పండుగ నిర్వహించడం సామాన్యం. ప్రతి వ్యక్తి తమ తాహతుకు తగినంతగా మేక, గొర్రె బలి ఇచ్చి ఆ మాంసాన్ని బంధుమిత్రులకు ఇవ్వడం సామాన్యం. ఈద్గా మైదానం ప్రార్థనల్లో వేలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు.

దొమ్మసంద్రలో...

దొమ్మసంద్ర: సర్జాపుర పట్టణం రేణుకానగర్‌లోని ఈద్గా మైదానంలో బక్రీద్ నేపథ్యంలో విశేష ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జాపుర గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ సర్జా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి వారికి నీరు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మత విద్వేషాలు లేకుండా సామరస్యంగా ఉండాలనేది తన ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ సర్జా, సర్జాపుర జామియా మసీదు ముఖ్యులు మహ్మద్, నూర్ మహ్మద్, మహ్మద్, జబీర్, మునీర్, షబ్బీర్, బకాష్, జబీ, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో...

శిడ్లఘట్ట: త్యాగ బలిదానాలకు ప్రతీక అయిన ఈద్ ఉల్ అజా (బక్రీద్)ను ముస్లింలు శనివారం అర్థవంతంగా ఆచరించారు. పట్టణంలోని జామియా మసీదు నుంచి ఊరేగింపుగా బయల్దేరిన ముస్లింలు ఈద్గా మైదానానికి చేరుకుని సామూమిక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు ధర్మగురు హజరత్ గులాం జిలాని బక్రీద్ గురించి ప్రత్యేక ప్రసంగం చేశారు. మహ్మద ప్రవక్త ఇస్మాయిల్ జబీవుల్లా సంస్మరణార్థం మేక, గొర్రెలను బలి ఇచ్చి ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒకటి కుటుంబసభ్యులకు, మరొకటి బంధువులకు, మరొకటి పేదలకు పంపిణీ చేయడం ఉద్దేశ్యంగా ఉందన్నారు. తద్వారా అల్లా కృపకు పాత్రులు అవుతారన్నారు. ఎమ్మెల్యే మేలూరు రవికుమార్ ఈద్గామైదానానికి చేరుకు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వీ మునియప్ప, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సామూహిక ప్రార్థనల అనంతరం తమ పూర్వీకుల సమాధి వద్దక వెళ్లి పుష్పాలు సమర్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుడా సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్సై వేణుగోపాల్, సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

విజయపురలో...

విజయపుర: పేద, మధ్య, శ్రీమంతులు అనే బేధం లేకుండా ఉన్నదాంట్లో పంచుకుని సమానంగా ఉండాలనే లక్ష్యం పెంపొందించేది బక్రీద్ పండుగ ధ్యేయమని జామియా మసీదు మౌల్వి అమీర్ అభిప్రాయపడ్డారు. స్థానిక చిక్కబళ్ళాపుర రోడ్డులోని ఈద్గా మైదానంలో బక్రీద్ సందర్భంగా శనివారం సామూహిక ప్రార్థనల్లో పాల్గొని ప్రత్యేక ప్రసంగం చేశారు. ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, ఆయన త్యాగ, బలిదానాలకు ప్రతీకగా బక్రీద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని పరస్పరం గౌరవించి సోదరభావంతో మెలగాలన్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. సాధారణంగా రంజాన్, బక్రీద్ పండుగలకు రాజకీయ నాయకులు తరలివచ్చేవారు. ఈసారి కనిపించకపోవడం గమనార్హం. సామూహిక ప్రార్థనల వేళ కొద్దిసేపు సంచారానికి అంతరాయం నెలకొంది.



సర్జాపురలో నీరు, శీతల పానీయాలను పంపిణీ చేస్తున్న గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు తదితరులు

బొమ్మనహళ్ళిలో...

బొమ్మనహళ్ళి: బక్రీద్‌ను పురస్కరించుకుని బండెపాళ్య ఈద్గా మైదానం, కావేరినగర్ ఈద్గా మైదానాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 10వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా ముస్లిం ధర్మగురువులు ప్రసంగించారు. రంజాన్, బక్రీద్ పండుగలు పేదలకు దానధర్మాలు చేయడంలో కీలకమన్నారు. త్యాగ బలిదానాలకు ప్రతీకగా పండుగలు ఉన్నాయన్నారు. కుటుంబీకులు, బంధుమిత్రులతో గడపడంతోపాటు పేదలకు తమవంతు చేయూత ఇవ్వడమే ఉద్దేశ్యమన్నారు. స్థానిక నాయకులు సయ్యద్ సర్దార్, బీఎంఎస్ నాయక్, ఇంకా కాంగ్రెస్ నాయకులను సత్కరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుబందోబస్తు నిర్వహించారు.

తాలూకాలో బక్రీద్ పార్థనలు

చింతామణి: పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా పలు ఈద్గా మైదానాలలో ముస్లింలు బక్రీద్‌ను పురస్కరించుకుని శనివారం విశేష ప్రార్థనలు నిర్వహించారు. చింతామణి పట్టణం దొడ్డపేటలోని జామియా మసీదు వద్దకు చేరుకున్న ముస్లింలు పట్టణ శివారులోని బాగేపల్లి రోడ్డులోని ఈద్గా మైదానానికి ఊరేగింపుగా చేరుకున్నారు. విశేష ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ధర్మగురువు హజరత్ మౌలానా మహ్మద్ సాదిక్ రఝా మిసబాహి ప్రసంగిస్తూ త్యాగ, బలిదానాల ప్రతీక అయిన బక్రీద్ పండుగను బంధుమిత్రులతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఇబ్రహీం త్యాగాన్ని స్మరిస్తూ నిర్వహించే పండుగగా పేర్కొన్నారు. జామియా మసీదు సమితి అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దేవనహళ్ళి తాలూకా విజయపురలో సామూహిక ప్రార్థన



శిడ్లఘట్టలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



బొమ్మనహళ్ళిలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

దళితసేన ఆధ్వర్యంలో రేపు ఉచిత హృద్రోగ పరీక్షా శిబిరం

చింతామణి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చింతామణి దళితసేన కర్ణాటక, అంబేడ్కర్ ఉచిత రక్తదాన సంస్థ, ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రి పరిశోధనా కేంద్రం, ఆర్‌ఎల్ జాలప్ప నారాయణ హృదయాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచిత హృద్రోగ పరీక్షా శిబిరం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు శిబిరం కొనసాగనుంది. తహసీల్దార్ కార్యాలయంలో శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 40ఏళ్ల పైబడిన వారిలో హృదయ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. అలాగని తక్కువ వయస్సువారిలోనూ లేకపోలేదన్నారు. ఎక్కువగా మాంసాహారాన్ని తీసుకునేవారు. అధిక బరువు కల్గినవారు, తదితరులు తప్పనిసరిగా హృదయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గుండెపోటు చెప్పిరాదన్నారు. మనం ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవడం ద్వారా ఆరోగ్యంపట్ల దృష్టి సారించాలన్నారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉచిత రక్తదాన సంస్థ అధ్యక్షుడు బీడా శ్రీనివాస్ ఇలాంటి సమాజసేవా కార్యక్రమాలు కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలతోపాటు తాజాగా హృద్రోగ పరీక్షా శిబిరం ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. బీడా శ్రీనివాస్ మాట్లాడుతూ 9న సోమవారం శిబిరంలో దేవరాజ్ అరసు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కృష్ణప్ప తదితరులు విచ్చేస్తారన్నారు శిబిరానికి విచ్చేసేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తెచ్చుకోవాలన్నారు.



శిబిరం కరపత్రాన్ని విడుదల చేస్తున్న మంత్రి సుధాకర్

11ఏళ్ల సాధనపై ఛాయాచిత్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కో-ఇన్‌చార్జ్ డాక్టర్ సుధాకరరెడ్డి తదితరులు

బెంగళూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం 11ఏళ్ల సాధనపై నగరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్‌లో శనివారం ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట్ర కో-ఇన్‌చార్జ్ డాక్టర్ సుధాకరరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అమరనాథ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే సంజయ్ పాటిల్, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.

ఎలక్ట్రికల్ చార్జింగ్ సరళీకృతం కావాలి

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వాహనాలకు ఆదరణ పెరుగుతోందని ఇటీవల ద్విచక్రవాహనాలతోపాటు కార్లు, బస్సులు అందుబాటులోకి వస్తున్నాయని బెస్కాం ఎండీ శివశంకర్ పేర్కొన్నారు. ఆ దిశగా చార్జింగ్ స్టేషన్‌లు సరళీకృతం కావాలన్నారు. బోల్ట్ ఎర్త్ కంపెనీ దేశంలో యూనివర్సల్ డీసీ చార్జర్ బ్లేజ్ డీసీని లాంఛనంగా ప్రారంభించారు. ఎలక్ట్రికల్ వాహనాల వాడకం పెరుగుతోందని, ప్రాంతాలవారీగా చార్జింగ్ స్టేషన్‌లు ఉంటే మరింత అనుకూలం కానుందన్నారు. బోల్ట్ ఎర్త్ సంస్థ సీఈఓ రాఘవ్‌భరద్వాజ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌లు, ఫుడ్ డెలివరీ చేసేవారు ఇతరత్రా ద్విచక్రవాహనదారులకు అనుకూలం ఉండాలనే చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు.



చార్జింగ్ స్టేషన్ ప్రారంభోత్సవం బెస్కాం ఎండీ శివశంకర్

జయకర్ణాటక ఆధ్వర్యంలో సిందూరవన

దొమ్మసంద్ర, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వీర సైనికులకు గౌరవ సూచకంగా సిందూర వన పేరిట జయ కర్ణాటక జన పరవేదిక సంఘం మొక్కలు నాటింది. ఆనేకల్ తాలూకా మరసూరు గ్రామపంచాయతీ ఆదిసానహట్టి పరిధిలో మొక్కలు నాటారు. కన్నడపర పోరాట నేత, జయకర్ణాటక జనపర వేదిక సంస్థ అధ్యక్షుడు బీ గుణరంజన్‌శెట్టి మార్గదర్శకంలో మొక్కలు నాటినట్టు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. బెంగళూరు జిల్లా అధ్యక్షుడు లోకేశ్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో విద్యా ర్థులతో కలసి మొక్కలు నాటినట్టు శ్రీనివాస్ తెలిపారు.



మొక్కలు నాటుతున్న సంఘం సభ్యులు

సమాజ సేవకు గౌరవం

బొమ్మనహళ్ళి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజకీయనేత, పారిశ్రామికవేత్త మాజీ ఎంపీ కుపేంద్రరెడ్డి చేసిన సామాజికంగా, ధార్మికంగా చేసిన సేవలకుగాను శనివారం ప్రత్యేకంగా సత్కరించారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లోని గాయత్రి దేవస్థానం, చిక్కతిరుపతిలోని వెంకటేశ్వర ఆలయం, మడికేరిలోని అమ్మవారి ఆలయం ఇలా ఎనిమిదేళ్లలో ఎన్నో ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. ఆలయాల నిర్వాహకులంతా చేరి ప్రత్యేకంగా అభినందించారు. పేద విద్యార్థులకు ఫీజులు సమకూర్చడమే కాక వారికి ఎంతో చేయూత ఇచ్చారు. విద్య, సామాజిక, ధార్మిక సేవలను గుర్తిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా కూల్డ్ బాబు, బాలకృష్ణారెడ్డి, కే వాసుదేవరెడ్డి, దిశంత్, ఆనంద్‌రెడ్డి, బాబు, వెంకటేశ్, రవీంద్ర, అశ్వత్థనారాయణ, సర్దార్, మహేంద్ర నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ కుపేంద్రరెడ్డికి సన్మానం

మాస్తి సాహితీ సేవలు అపారం



మాస్తి జయంతిలో అధ్యాపకులు నాగానంద కెంపరాజ్ తదితరులు

బంగారపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కన్నడ ఆస్తి అంటే ప్రఖ్యాత శ్రీనివాస్ కావ్యనామాంకితులు మాస్తి వెంకటేశ్ అయ్యంగార్ అని ఆయన కన్నడ సాహిత్యంతోపాటు చిన్నకథల ద్వారా ప్రజల ఆదరణ పొందారని అధ్యాపకులు నాగానంద కెంపరాజ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఎస్‌డీసీ కళాశాల డీవీజీ సభాంగణంలో అనికేతన కన్నడ బళగ ఆధ్వర్యంలో మాస్తి వెంకటేశ్ అయ్యంగార్ 134వ జయంతిని ప్రారంభించి మాట్లాడారు. మాస్తి వాస్తవవాదిగా, మానవతావాది, ఉదారవాదిగా పేరొందారన్నారు. కావ్య, కవనం, విమర్శ చిన్నకథలు, నవలలు ఇలా అన్ని రకాల రచనలు చేశారన్నారు. దశాబ్దాల పాటు కన్నడ సాహిత్యానికి సేవలందించారన్నారు. సంఘం అధ్యక్షుడు రామ్‌ప్రసాద్, ఆదర్శపాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామల, రోటరీ సంస్థ అధ్యక్షుడు ఉమేశ్, కేజీ మంజునాథ్, సతీశ్‌కుమార్, ప్రహ్లాదరావ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో మంటలు... తప్పిన పెను ప్రమాదం

బెంగళూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా హనూరుకు అనుబంధమైన ఆర్‌ఎస్ దొడ్డి నుంచి శనివారం ఉదయం చించళ్ళి గ్రామానికి జొన్నగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లో అకస్మికంగా మంటలు చెలరేగాయి. గుర్తించకనే వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ రవిని అదే మార్గంలో వస్తున్న హనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆనందమూర్తి అప్రమత్తం చేశారు. వెంటనే సీఐ జీప్‌ను ఆపి ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు బసవణ్ణ, మహదేవస్వామి, సిద్ధప్పలను కిందకు దింపేశాడు. కొద్దిదూరంలో ట్రాక్టర్‌ను ఆపి రవి కూడా కిందకు దిగేశాడు. జొన్నగడ్డి పూర్తిగా మంటల్లో కాలిపోయింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. మొత్తమ్మీద సీఐ కార్యవైఖరిని పలువురు ప్రశంసించారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1600.71	1,578.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	8,882	2.190
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	253	6
నీటి నిల్వ (టీఎంసీలు)	22.46	3.82

తాళి కట్టే వేళ తప్పించుకుంది..!

● బాల్య వివాహానికి ప్రయత్నించిన తల్లిదండ్రులు ● తాళి లాక్కుని పరుగులు తీసిన 8వ తరగతి బాలిక



బళ్లారి గాంధీనగర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహానికి ప్రయత్నిస్తున్న తల్లిదండ్రుల నుంచి ఓ చిన్నారి ఒంటరిగా పోరాడి తప్పించుకుంది. ఈ ఘటన చిత్రదుర్గ జిల్లాలో వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం, చివరికి పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి బాలికను కాపాడారు. చెళ్ళకెర తాలూకాలో ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినికి ఆమె తల్లిదండ్రులు మేనమామకు ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ వివాహం గురించి ఆ అమ్మాయికి మొదట తెలియదు. తన అనుమతి లేకుండా తనకు వివాహం ఎలాచేస్తారని బాలిక తల్లిదండ్రుల నిర్ణయాన్ని వ్యతిరేకించింది. నాన్న, అమ్మ, పెదనాన్న, పెద్దమ్మ తనకు పెళ్ళి వద్దు...తాళి కట్టించ వద్దు.. తతనుకాపాడాలని...మీ కాళ్ళకు పడుతాను రక్షించాలంటూ... 14ఏళ్ళ బాలిక నెత్తి నోరుకొట్టుకున్నా పట్టించుకోని తల్లితండ్రులు హింసించి కిందపడేసి మేనమామతో తాళి కట్టించే ప్రయత్నం చేశారు. చాలామంది మంది కూడగట్టుకుని తాళి కట్టించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పెళ్లి నుంచి బయట పడే ప్రయత్నంలో ఇంటి నుంచి బయటకు పరుగులు దీసిన అమ్మాయి, వరుడు చేతిలో తాళి లాక్కుని పరుగులు తీసింది. బాలిక వెంట బంధువులు పరుగులు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. బాలికను రక్షించేందుకు ఇరుగు పొరుగు వారు ప్రయత్నించినా...బాలిక తల్లిదండ్రులు వారిని దగ్గరకు రానివ్వలేదు. సుమారు అరగంటకు పైగా జరిగిన ఈ ఘటనలో ఆఖరికి వివాహ బంధం నుంచి విముక్తి పొందింది. కొంత మంది గ్రామస్తులు ఈ దృశ్యాలను చెళ్ళకెర పోలీసులకు చేరవేయడంతో అదే రోజు సాయత్రం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలికను రక్షించి నగరంలోని బాల మందిరానికి తరలించారు. బాలిక ధైర్యాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. బాలిక తలిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించారు. బాలికను బలవంతంగా తాళికట్టించే ప్రయత్నంచేసే నేపథ్యంలో అమ్మాయికి దెబ్బలు తగిలాయని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



వెంకటేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కసాప సభ్యులు

ప్రముఖ కవి వెంకటేశ్‌మూర్తికి నివాళి

బళ్లారి సిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కన్ను మూసిన ప్రముఖ కవి, నాటక రచయిత , విమర్శకుడు వెంకటేశ్‌మూర్తికి నగరంలోని కన్నడ భవనంలో కన్నడ సాహిత్య పరిష్యత్తు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ కొట్రప్ప తన అధ్యక్షత ప్రసంగంలో మాట్లాడుతూ వారు సరళమైన వ్యక్తిఅని, ఆయన అధ్యాత్మిక వ్యక్తి ఆయన రాసిన అనేక లిరికల్ పాటలు ఒక వ్యక్తి జీవితాన్ని నిర్మించడంలో సహాయబడ్డాయి. ప్రతి వ్యక్తి తాను ఎదుర్కోన్న సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో కవిత్వం ద్వారా నేర్పిన కవి, ఇంత గొప్ప వ్యక్తిని కోల్పోయిన తర్వాత మన కన్నడ సాహిత్య ప్రపంచం పేదిరకంలోకి మారిందని చెప్పడంలో తప్పులేదని ఆయన తన అధ్యక్ష ప్రసంగంలో అన్నారు. ఈసందర్భంలో లెక్చరర్ తిమ్మప్ప, లెక్యరర్ చాంద్‌బాషా వారి వారి కవితలు పఠించారు. పద్యాలను వినిపించారు. జిద్యక్షులు రిష్విరుద్రప్ప, హనుమంత రావు, జిలాన్‌బాషా, మల్లికార్జున,మహిళా కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



అలంకరణలో హనుమంతుడు

బొమ్మనహాళ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు, పవన్‌చార్యులు పూజలు చేశారు. సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, అష్టోత్తర నిర్వహించి మూలవిరాట్‌కు పుష్పాలంకారణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

టిక్కెట్ల విధానం రద్దు చేయాలి

గుత్తి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఇటీవల ప్రవేశపెట్టిన దర్శనానికి టికెట్ల విధానాన్ని రద్దు చేయాలని ఆలయ అర్చకుడు మాణిక్య రంగనాథస్వామి, కమిటీ అధ్యక్షుడు మాకం శ్రీకాంత్ కోరారు. ఆలయం వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. స్వామివారి దర్శనానికి టిక్కెట్ల విధానం అమలు చేయడం వల్ల భక్తులకు అన్యాయం చేయడమేనన్నారు. స్వామివారిని గ్రామీణ ప్రాంతాల భక్తులే ఎక్కువగా దర్శించుకుంటున్నారన్నారు. అలాంటి భక్తులపై ఆర్థిక భారం మోపడం తగదన్నారు. అర్చకులు రంగనాయకులు, చేతన్, నవీన్, మాణిక్య రంగనాథస్వామి అభివృద్ధి కమిటీ సభ్యులు కిషోర్‌పాల్గొన్నారు.

నేడు విత్తన వేరుశనగ పంపిణీ

రాయదుర్గంరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగకాయల పంపిణీని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి మహేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు



ఎత్తినబూదేహాళ్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



యాల్పిలో ర్యాలీగా వస్తున్న ముస్లింలు

బళ్లారి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. బళ్లారి రూరల్ తాలుకాలోని రూపనగుడి, కుంటనహాళ్, యాల్పి, కుమ్మరచేడు, కారేకల్, వీరాపురం, మోకా, ఎత్తిన బూదేహాళ్, అసొండి తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఉదయాన్నే ఈద్గా మైదానాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా హగరి ఎస్ఐ తిమ్మారెడ్డి, మోకా ఎస్ఐ కాళింగ, పోలీసు సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, బసవన్న గౌడ తదితరులు బందోబస్తు నిర్వహించారు. పలువురు నాయకులు, ప్రముఖ నేతలు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా శోభాయాత్ర



పార్శ్వనాథుడి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బళ్ళారి సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పార్శ్వనాథ జైన్ శ్వేతాంబర్ మందిర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ శనివారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించింది. తేరువీదిలోని జైన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు మోతి సర్కిల్, కాళమ్మవీధి, బెంగళూరు రోడ్డు బ్రూస్‌పేట సర్కిల్ మీదుగా మళ్ళీ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపులో జైన్ సంఘం అధ్యక్షుడు ఉత్పల్‌లాల్ బాగ్రేవా, ఉపాధ్యక్షుడు సూరజ్‌మల్, రోషన్‌జైన్, అనిల్ బాగ్రేవా, భరత్, గౌతమ్.మహావీర్, అజయ్ సోని, ఆలయ జమాజానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఉపన్యాస తరువాత ప్రసాదాల పంపిణీ జరిగింది. శతాబ్ది ఉత్సవాలకు సమాజ వర్గం నగరంలోని ప్రజలు అనేకులు పాల్గొని దేవుని ఆశీర్వాదం తీసుకుని తరించారు

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలంలో నరసింహస్వామి పల్లకీ సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా రు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లికి చెందిన బోయ పాలన్న కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానపడ్డారు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసాయాన్ని శనివారం అందచేశారు.

బంగారు గొలుసు అపహరణ

గుంతకల్లుటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో పుష్పావతి అనే మహిళ మెడలో బంగారు చైన్‌ను శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగుడు లాక్కేళ్లాడు. ఆలూరు రోడ్డులో సాయిబాబా దేవాలయం వద్ద నివాసముంటున్న పుష్పావతి హనుమాన్ సర్కిల్‌లోని విశాల్ మార్ట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతోంది. సాయిబాబా దేవాలయం వద్దకు రాగానే వెనుక నుంచి ద్విచక్రవాహనంలో హెల్మెట్ ధరించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి పుష్పమెడలో ఉన్న మూడు తులాల చైన్‌ను లాక్కేళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4188 మంది పరీక్షలు రాయగా 1902 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో ఉత్తీర్ణతా శాతం 45గా నమోదైంది. దీంతో రాష్ట్రంలో 13వ స్థానం లభించింది. ద్వితీయ సంవత్సరంలో 2199 మంది పరీక్షలు రాయగా 1437 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 65గా నమోదైంది.

రోడ్ల దుస్థితిపై నిరసన



నీటిలో నిరసన తెలుపుతున్న వ్యక్తి

బళ్లారి సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): సండూర్ తాలూకాలోని భుజంగనగర్, నరసింహపుర గ్రామాలను కలిపి ప్రధాన రహదారులలోని లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు పేరుకుపోయిప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుండటంతో నీటిలో కూర్చుని ఒంటరిగా నిరసన తెలుపుతున్న స్థానికులు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈరోడ్డు జాతీయ ఖనిజాభవృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ)కి అనుసందానించ ప్రధాన రహదారి ప్రతిరోజు వందలాది వాహనాలు దీనిపై తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డులోని లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు పేరుకుకోవడంతో బైకలతో సహా వివిధ వాహనాల ప్రయాణీకులు కదలాడానికి ఇబ్బందలు పడుతున్నారు.,కొత్తరోడ్లు లేకపోవడం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్డుపై చాలా నీరు నిలిచిపోతుందని, ఈ ప్రదేశంలో రోడ్డుపై పడి వివిధ వాహనాల డ్రైవర్లు గాయపడుతున్నారని ప్రజల రాకపోకలు సజావుగా సాగేందుకు తాలూకా యంత్రాంగం త్వరగా కొత్త రోడ్డును నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

సండూరు.. అందాల జోరు..!



గాంధీజీ దర్శించుకున్న ప్రదేశం

కంప్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతం సండూరు ఈ ఏడు ముందే కళకళలాడుతోంది. ఏటా సెప్టెంబర్‌లో పర్యాటకులు అధికంగా సందర్శించడం ఆనవాయితీ. అయితే ఈ సారి ముందస్తు వర్షాలతో కాలువలు జలకళ సంతరించుకున్నాయి. ఇక పచ్చదనంతో చెట్లు కళకళలాడుతన్నాయి. మే నెలలోనే వర్షాలు పుష్కలంగా కురవడంతో ప్రతి కొండ పచ్చదనం సంతరించుకుంది. వాహనదారులు పచ్చని దారుల్లో జాలీగా ప్రయాణిస్తున్నారు. వర్షాలు పుష్కలంగా కురవడంతో కొండల్లో నుండి జల పాతాలు జోరుగా పారుతున్నాయి. నారళ్ల జలాశయం నీరు చేరుకుని సండూరు నుంచి తోరణగల్లు వైపు వెళ్లే ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో ఈ ప్రాంతాన్ని మహాత్మాగాంధీ సందర్శించారు. అప్పట్లోనే సండూర్ ఇన్ సెప్టెంబర్ అని అన్నారు. అంటే సండూర్ అందాలను సెప్టెంబర్‌లో తప్పక చూడాల్సిందే అని ఆయన భావించారు. వారాంతం కావడంతో కానీ ఈ సంవత్సరం మాత్రం మే నెల చివరిలోగానే వర్షాల రాకతో సండూరు పచ్చదనం ఆకట్టుకుంటోంది. పలు ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కూడా పెరిగిపోయింది.

పచ్చని కొండలు..



హోసూరు జోన్

కాలువ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

హోసూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): హోసూరు బాలాజినగర్ ప్రాంతంలో సుమారు 10లక్షల రూపాయలతో చేపట్టిన మురుగునీటి కాలువపనులకు ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఎంకే పార్టీ ఏరియా కార్యదర్శి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జోనల్ కమిటీ చైర్మన్ రవి, కౌన్సిలర్ సంతోష్, వార్డు కార్యదర్శి రఘు, యూనియన్ కమిటీ మాజీ సభ్యుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అన్ని వార్డుల్లో దశలవారీగా పనులు కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

విడపనకల్లు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాబా ఫకృద్దీన్(38) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు విడపనకల్లు గ్రామానికి చెందిన బాబా ఫకృద్దిన్ వాహన డ్రైవర్‌గా రోజు కూలీకి వెళ్తున్నాడు. డ్రైవర్‌గా పనులు లేక పోవటంతో కుటుంబ పోషణకు అనేక చోట్ల అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం తెలియక మద్యం మత్తులో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. భార్య శర్మస్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విడపనకల్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కూడేరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామ సమీపం ప్రధాన రహదారికి ఆనుకుని ఓ ప్రదేశంలో గుర్తు తెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు దాదాపు 25 సంవత్సరాల వయసున్న మహిళ గొట్కూరు గ్రామ సమీపంలో మృతి చెందడంతో, ఎనుముల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజ, ఏఎస్ఐ రామానాయుడు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. గుర్తు తెలియని మహిళ శవం అనుమానస్పదస్థితిలో ఉందని, మూడు రోజుల క్రితం మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యా లేక ఆత్మహత్య అన్న విషయం పోస్టుమార్టం నివేదిక తేలుతుందన్నారు. కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.



అన్నదానం చేస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు

సామాజిక సేవలో అన్నాడీఎంకే కార్యకర్తలు

కృష్ణగిరి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేపనహళ్ళి ఎమ్మెల్యే, అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేపీ మునుసామి 74వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు శనివారం పలు సామాజిక సేవలు నిర్వహించారు. తొలుత 74 కిలోల కేక్ కట్ చేసి పలు చోట్ల కొబ్బరి మొక్కలు పంపిణీతోపాటు కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా అన్నదానం నిర్వహించారు. వరదరాజ స్వామి ఆలయంలో పూజలు జరిపించారు. శూలగిరి కూడలిలో కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు, నీరు, ఆహారం పంపిణీ చేశారు. శూలగిరి సమీపంలోని కొల్లపల్లిలోని కస్తూర్బా గాంధీ బోర్డింగ్‌స్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సమకూర్చారు. వృద్ధులకు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి మల్లియన్, జిల్లా ఉపకార్యదర్శి కలైచెల్వి, అసోసియేషన్ నిర్వాహకుడు కేటీఆర్ తిమ్మరాజు, శూలగిరి తూర్పు యూనియన్ అసోసియేషన్ కార్యదర్శులు బాలసుబ్రమణ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో దుక్కులు ప్రారంభం

హోసూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా దుక్కులు ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా భూములను దుక్కు చేసుకోవడంలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈసారి వేసవిలో ముందస్తు వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. డెంకణీకోట, అంచెట్టి, ఉరిగం తదితర ప్రాంతాల పరిధిలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పత్తి, వరి, వేరుశనగ తదితర పంటలకు దుక్కులు ప్రారంభించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి నీటికుంటలు, చెరువులు జలకళతో సంతరించుకున్నాయని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.



అంచెట్టి పరిధిలో దున్నిన పొలం